www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 28 మే 2023



కుక్కల దాడిలో 4 దుప్పులు మృతి



మృతి చెందిన దుప్పులు

ప్రజాశక్తి-సిద్ధవటం

కడప జిల్లా సిద్ధవటం మండలంలోని ఎస్.రాజంపేట ఎస్సి కాలనీ శివారు రిజర్వ్ ఫారెస్ట్ సమీపంలోని శివారెడ్డి పొలం వద్ద కుక్కల దాడిలో తెల్లవారు జామున నాలుగు పొడదుప్పిలు మృతి చెందాయి. సిద్ధవటం అటవీక్షేత్రాధికారి ప్రసాద్, డిప్యూటీ రేంజర్ ఓబులేసు, ఫారెస్ట్ బీటు అధికారి రాజశేఖర్‌రెడ్డి, ఎబిఒ హైమావతి, అటవీ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు తెలిపిన వివరాల మేరకు...శనివారం తెల్లవారుజామున పొడదుప్పులను కుక్కల మంద తరుముకుంటూ వచ్చి దాడి చేయడంతో ఒక ఆడ జింక దాని మూడు పిల్లలు తీవ్ర గాయాలతో మృతి చెందాయి. విషయం తెలియడంతో సిబ్బందితో కలిసి సంఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. మృతి చెందిన పొడదుప్పులను సిద్ధవటం అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. సిద్ధవటం పశువైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. సాహెబ్‌బావి బేస్ క్యాంపు వద్ద దుప్పులకు ఖననం చేశారు.

కనుమరుగవుతున్న 'పేదవాడి ఫ్రిజ్'



- మట్టి దొరకకపోవడం ఓ కారణం
- ఉపాధి కూలీలుగా మారుతున్న వైన్యం
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న శాలివాహనులు

వేసవి ఎండల తీవ్రతకు మనిషి దాహం వేసినప్పుడు సరాసరి వెళ్లేది మంచినీటి కుండవద్దకే. అందుకే మట్టికుండను పేదవాని ఫ్రిజ్ అంటారు. నేటి ఆధునిక సమాజంలో మట్టికుండ కనుమరుగైపోతుంది. ఈ వృత్తిపై ఆధారపడిన శాలివాహనుల జీవితాలు అగమ్యగోచరంగా తయారయ్యారు. వేసవి వచ్చిందంటే మట్టి కుండలకు చాలా గిరాకీ ఉండేది. శాలివాహనులు కుండలు తయారు చేసి ఆర్థికంగా కొంత బలపడేవారు. వేసవిలో సంపాదించుకున్న డబ్బులు ఏడాది పాటు వాడుకుంటూ వర్షాకాలం, చలికాలంలలో కూలీ నాలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. గతంలో పేద మధ్యతరగతి ప్రజలతో పాటు ఉన్నత వర్గాలకు చెందిన వారు కూడా మట్టి పాత్రలపై మక్కువ చూపేవారు. మార్కెట్లోకి ప్లాస్టిక్ వస్తువులు, వాటర్ క్యాన్లు, ఫ్రిజ్‌లు విరివిగా రావడంతో మట్టి కుండలు వాడకం కాలక్రమేనా తగ్గిపోతుంది.

ప్రజాశక్తి-రాయచోటి

మట్టి కుండలో ఉండే నీరు చల్లగా రుచికరంగా ఎంతో దాహాన్ని తీరుస్తాయి. నేడు మట్టి కుండలు కొనేనాధుడే కరువయ్యారు. మట్టి కుండలకు గిరాకీ ఉండే వేసవిలో కూడా అంతంతమాత్రంగా కుండలు కొనుగోలు ఉండడంతో ఈ వృత్తిపై ఆధారపడిన ఎన్నో శాలివాహనుల జీవితాలు ఆగమ్యా గోచరంగా మారాయి. ప్రభుత్వం ఈ వృత్తిదారులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వం ఆధుకోకపోవడం వల్ల కులవృత్తులు నేడు కనుమరుగవుతున్నాయి. చేతి వృత్తుల పనివారికి ప్రోత్సహించి వారి వృత్తులు కనుమరు కాకుండా చూడాల్సిన బాధ్యత ఎంతో ఉంది. లేకుంటే రాబోవు రోజుల్లో మట్టి కుండ అని బొమ్మల ద్వారా రాబోవు తరాలకు చూపించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కావలసిన బంకమట్టి గతంలో దొరికేది. నేడు ఉన్న మట్టిని కూడా ఎక్కడపడితే అక్కడ గృహ నిర్మాణాలకు, లేఔట్లకు తరలించడం వల్ల మట్టి కూడా కరువవుతోంది. కుమ్మరులు మట్టికుండల తయారీ కావలసిన మట్టి దొరకక పోవడంతో చేసేదిలేక నేడు చాలా మంది ఉపాధి పని కూలీలుగా మారారు.

అరకొరగానే చలివేంద్రాలు

ఎండాకాలం వచ్చిందంటే చాలా మంది ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, ప్రజలు ఎక్కువగా తిరిగే ప్రాంతాలలో మట్టికుండలతో ఉప్పు బానులతో మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రజల దాహాన్ని తీర్చుతుంటారు. గతంలో ఎక్కడపడితే అక్కడ చలివేంద్రాలు ఉండేవి. ప్రస్తుతం కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా చలివేంద్రాలను జిల్లాలో రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గం, మండల కేంద్రలలో కూడా ఏర్పాటు చేస్తున్నారు. మట్టి కుండల తయారీ గతంలో కంటే నేడు కొంత తగ్గింది. ఎందుకంటే కుండలు కొనే వారి సంఖ్య గణనీయంగా తగ్గడంతో చేసేవారు కూడా కుండలు అమ్ము పోకపోవడంతో ఈ కుండల తయారీకి ముగ్గు చూపకపోవడం గమనార్హం.

కుండలకు కొన్నిచోట్ల గిరాకీ

మట్టి కుండలకు కొన్ని చోట్ల గిరాకీ బాగుంటుంటోంది. మట్టి కుళాయి కుండ రూ.250 నుంచి 350, సాధారణ కుండ రూ.150 నుండి 350, వాటర్ బాటిల్ రూ.200, హుండీ రూ.50, పూల కుండి రూ.150, మట్టి ప్రమిదలు, మూకుళ్ళు, ఇతర మట్టి సామగ్రిని అమ్ముతున్నారు. అంగళ్ళ, మైదుకూరు, ప్రొద్దుటూరు, కడప ప్రాంతాల నుంచి తెచ్చుకొని మారుబేరాలకు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. నచ్చకపోతే ఆకలి కేకలు ఉన్నట్లుగా ఈ వ్యాపారం సాగుతుందన్నారు. కొనేవారు వస్తే ఆ అమ్ముడుపోతే నాలుగు రూపాయలు ,తమకు వస్తుందని అమ్ముడుపోకపోతే ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ అమ్మకం దా ర్ల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందిని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మట్టి పాత్రల వాడకం తగ్గింది

మట్టితో తయారు చేసిన పాత్రలు వాడకం బాగా తగ్గింది. గతంలో మట్టి కుండలకు వ్యాపారం బాగా ఉండేది. 20 సంవత్సరాలుగా మట్టి కుండల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాను. రానురాను వ్యాపారం తగ్గుముఖం పడుతుంది. రోజంతా ఇద్దరు మనుషులు వ్యాపారం చేస్తున్నాం. రోజంతా వ్యాపారం జరిగితే ఖర్చులు పోను రూ.500 నుండి 800 వరకు వస్తుంది. ప్రభుత్వం కులవృత్తి చేసే వారందరికీ ఆర్థిక సాయం అందించాలి.



- బాలయ్య, మట్టి కుండల వ్యాపారి, రాయచోటి.

ఇఎస్‌ఐని బలోపేతం చేయండి : 'సిటు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఇఎస్ఐ ఆస్పత్రిని బలోపేతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామంజులు, జిల్లా ఉపాధ్యక్షులు సి.రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాజంపేట కేంద్రంగా 30 పడకల ఆసుపత్రి నిర్మించాలని, వైద్యుల ఖాళీలను భర్తీ చేయాలని, కార్మికులకు సౌకర్యాలను కల్పించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసంఘటితరంగ కార్మికుల వైద్యం కొరకు కార్మికుల జీతాలలో డబ్బు కట్ చేసి స్లిప్పులు ఇస్తున్నారు తప్ప ఆ డబ్బులు రిజర్వ్ బ్యాంకులో వేసి పెట్టుబడిదారులకు రాయితీ రూపంలో ఇస్తున్నారని తెలిపారు. అసంఘటితరంగ కార్మికులకు వైద్యసదుపాయాలు కల్పించలేదని పేర్కొన్నారు. రాజంపేటలో వేలాదిగా ఇఎస్ఐ నోచుకోని కార్మిక, ఉద్యోగుల సంక్షేమం కోసం ఈయస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలన్నారు. ఇఎస్ఐ స్కీమ్ ద్వారా కార్మికులు, ఉద్యోగులకు మందులు, సిక్ లీవులు, నిరుద్యోగభృతి, పెన్షన్లు వంటి తదితర సౌకర్యాలకొరకు తమ వేతనం లోని కొంత నగదును ఎంప్లాయ్ మెంట్ స్టేట్ ఇన్సూరెన్స్ పేరుతో రిజర్వ్ బ్యాంక్‌లో జమ చేసిన మొత్తం లక్షా పదివేల కోట్లు ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్కడా కూడా పరికరాలు, మందులు, ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా పేద కార్మికులకు అరకొరగా అందుతున్న వైద్యాన్ని కూడా పూర్తి ప్రైవేటీకరణ చేసే దశలో భాగంగా డిస్పెన్సరీలను నిర్వీర్యం చేస్తున్నాయని తెలిపారు. కార్మికులు ప్రజలతో కలసి ఇఎస్ఐ పథకాన్ని బలోపేతం చేసే వరకు ప్రభుత్వాల పై ఒత్తిడి చేయాలని పిలుపు నిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇఎస్ఐ పథకాన్ని నీరుగారుస్తున్నాయని విమర్శించారు. దేశమంతటా ఇఎస్ఐ పథకాన్ని 2022 కల్లా విస్తరించాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ అది ఎక్కడా అమలు కాకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ఓబయ్య, ప్రసాద్, లక్ష్మిదేవి, మధు, సాలమ్మ, నాగరాజ, శ్రీను, రాములమ్మ, వరలక్ష్మి తో పాటు పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజా సంక్షేమమే జగనన్న సంకల్పం : 'గడికోట'



ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి- రామాపురం

ప్రజల సంక్షేమమే జగన్ సంకల్పమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని చిట్లూరు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వంను ప్రారంభించారు. ఫక్కీరుపల్లె, పాలన్నగారిపల్లె, ఏకిలపల్లెలలో నిర్వహించిన గడప గడపకూ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలును వివరిస్తూ, ప్రజలును ఆప్యాయంగా పలుకరిస్తూ, సమస్యలపై ఆరా తీసి వాటి పరిష్కారానికి చొరవచూపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సుఖ సంతోషాలే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గడికోట జనార్ధన్‌రెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణప్ప విశ్వనాధరెడ్డి, ఎఒ నాగమణి, ఉద్యాన అధికారి నాగమణి, వైస్ ఎంపిపిలు రవిశంకర్‌రెడ్డి, బాబు, సర్పంచ్ రామాంజులు, ఎంపిటిసి చిన్న నరసింహులు, మాజీ ఎంపిపి నక్కా నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారెడ్డి, ఆదిరెడ్డి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు శివ శంకర్, సింగల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, సర్పంచులు అయోధ్యాపురం నాగభూషన్‌రెడ్డి, వెంకట రెడ్డి, ఆంజనేయులు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, హస్తకళల డైరెక్టర్ హుసేన్, యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరం వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

వంద పడకల ఆస్పత్రిలో 'మేడా' తనిఖీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలో గల 100 పడకల ఏరియా వైద్యశాలను శాసనసభ్యులు మేడా వెంకట మల్లికార్జున్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఆసుపత్రి సిబ్బందితో, డైరెక్టర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన రోగుల పట్ల సిబ్బంది వ్యవహరిస్తున్న పని తీరును అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది వైద్యశాలలోని కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అయన స్పందిస్తూ ఉన్నతాధికారులతో చరవాణి ద్వారా మాట్లాడి సమస్యల పరిస్కార దిశగా కృషి చేశారు. రాత్రి వేళల్లో అందుబాటులో ఉండవలసిన వైద్యుల గురిం చి, వైద్యశాల సౌకర్యాల గురించి చర్చించి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి డైరెక్టర్ హస్తవరం ఉమామహేశ్వర్ రెడ్డి, వడ్డేశ్రీను, ఆసుపత్రి సూపరిండెంట్ రాజు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యూజ్ ఆఫ్ కాల్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-రాయచోటి

విద్యుత్ సమస్యలపై ప్రజలు విద్యుత్ సంస్థ ఏర్పాటు చేసిన ఫ్యూజ్ ఆఫ్ కాల్‌ను సద్వినియోగం చేసుకోవాలని డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఫ్యూజ్ ఆఫ్ కాల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. 9490615238 ఇది 24/7 గంటలు పని చేస్తుందని తెలిపారు. ఈ నంబర్ స్పందించని ఎడల రాయచోటి పట్టణం తూర్పు విభాగంలో 9440814300, పశ్చిమ విభాగాల్లో 9440814299, రాయచోటి రూరల్ 9491052942 నెంబర్లకు ఫ్యూజ్ ఆఫ్ కాల్ చేసి ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్న ఫిర్యాదు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజల సద్వినియం చేసుకోవాలని కోరారు.

త్యాగానికి చిహ్నం రమాబాయి అంబేద్కర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రపంచ మేధావి అంబేద్కర్ సతీమణి మాతా రమాబాయి వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక బాస్ కార్యాలయం వద్ద సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారతీయ అంబేద్కర్ సేన (బాస్), విసికె పార్టీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. బాస్ విసికె నాయకులు రమాబాయి చిత్రపటాన్ని పూలమాలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ ది సింబల్ ఆఫ్ శాక్రిఫైజ్‌గా ఆమెను అభివర్ణించారు. ఒక సాధారణ వ్యక్తిగా వున్న అంబేద్కర్, అసాధారణ శక్తిగా అవతరించడం వెనుక మాతా రమాబాయి త్యాగం ఎంతో ఉందని పేర్కొన్నారు. దేశ ప్రజల విముక్తి కోసం, దేశాభ్యుదయం కోసం అంబేద్కర్ జ్ఞాన సముపార్జన చేయడానికి వెలుగునిస్తూ, కొవ్వొత్తిలా కరిగియిన త్యాగశీలి మాతా రమాబాయి అని కీర్తించారు. ఈ మహనీయుల త్యాగాలను దేశం ఎప్పటికీ గుర్తు పెట్టుకొని, గౌరవిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విసికె రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాల మోహన్, బాస్ జిల్లా నాయకులు నీరుగట్టి రమణ, చాట్ల బయన్నలతోపాటు బాస్, విసికె నాయకులు టి.ఎ.పీర్‌బాషా, గిన్నెల మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.



రమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని సుండుపల్లి పంచాయతీ పోచంపల్లి ఎగువమాలపల్లె, కుమ్మరపల్లెలో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. రాత్రుళ్ల ఇళ్లల్లో నుంచి బయటకు రావాలంటే ఇబ్బందిగా ఉందని పేర్కొంటున్నారు. విషపురుగులతో భయపడుతున్నామని వాపోయారు. వీధిలైట్లు ఏర్పాటు చేయాలని పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఎన్నికల సమయంలో హామీలు వర్షం కురిపించిన నాయకులు గెలిచిన తరువాత ఇటువైపు చూసిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీధిలైట్ల సమస్యతోపాటు తాగునీటి పైప్‌లైన్లు అస్తవ్యస్తంగా ఉండడంతో నీళ్లని ఇళ్లల్లోకి వస్తున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ఇసుక, మట్టికి అనుమతి ఇవ్వాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

ఇసుక, మట్టిని తోలుకునేందుకు అధికారులు అనుమతులు ఇవ్వాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు బండి ఈశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని జగనన్న కాలనీలో లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం పునాదులు వేసుకోవాలంటే మట్టి, ఇసుక అవసరమని తెలిపారు. తోలుకునేందుకు అధికారులు కేవలం మండలంలోనే అడ్డంకులు చెబుతున్నారన్నారు. పక్క మండలాల్లో అధికారులు జగనన్న కాలనీలకు ఇసుక, మట్టిని తోలుకునేందుకు అనుమతిలిచ్చినా ఇక్కడి అధికారులు తనికీల పేరుతో అడ్డుకుంటూ ఇళ్ల నిర్మాణాలకు ఆటంకులుగా మారారని తెలిపారు. ఒక వైపు జగనన్న కాలనీల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ సమావేశం పెట్టి చెబుతున్నా మరో వైపు కింద స్థాయి అధికారులు ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోవడం దారుణమన్నారు. వెంటనే ఇసుక, మట్టి తోలుకునేందుకు అధికారులు అనుమతి ఇచ్చి లబ్ధిదారులను ఆదుకోవాలని కోరారు.

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్

ప్రజాశక్తి-రాయచోటి

మహిళలందరూ పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, డాక్టర్ రాధిక, డాక్టర్ శ్రావణి పేర్కొన్నారు. శనివారం స్థానిక మెప్మా కార్యాలయంలో మహిళల వ్యక్తిగత పరిశుభ్రతపై మెప్మా ఆధ్వర్యంలో ఆరోగ్య పరిశుభ్రత అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల వ్యక్తిగత పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, మెడికల్ అధికారులు రాధిక, శ్రావణి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ డాక్టర్ రాధిక మాట్లాడుతూ మహిళలు నెలసరి సమయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఐరన్ పుష్టిగా లభించే పౌష్టిహారం తీసుకోవాలని సూచించారు. మెప్మా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జున, మెప్మా సిఎంఎం అబ్బాస్, సిఒలు, ఆర్‌పిలు, ఎఎన్ఎంలు మహిళలు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ అభివృద్ధికి చర్యలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌ని మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యమని మదనపల్లి ఆర్‌డిఒ ఎం.ఎస్.మురళి స్పష్టం చేశారు. శనివారం ఆయన హార్సిలీహిల్స్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే హార్సిలీహిల్స్ గణనీయమైన అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. కలెక్టర్ గిరీష హార్సిలీహిల్స్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుండి తరలివచ్చే పర్యాటకులకు మెరుగ్గైపైన సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. తిరుమల హైయిట్ పాయింట్ వద్ద ఆర్చీ నిర్మాణానికి అవకాశాలను పరిశీలించడం జరిగిందన్నారు. త్వరలోనే ఆర్చి నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. హార్సిలీహిల్స్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెంచడమే తమ ధ్యేయమన్నారు. పర్యాటకులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆయన సూచించారు.ముందుగా ఆర్డీవోగా పర్యాటక శాఖ డివిజనల్ మేనేజర్ గిరిధర్‌రెడ్డి, హార్సిలీహిల్స్ మేనేజర్ సాల్విన్‌రెడ్డి, బి.కొత్తకోట తహశీల్దార్ రఫీక్ అహ్మద్ ఘనస్వాగతం పలికారు.

వాల్మీకిపురంలో లోకాయుక్త విచారణ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పట్టణంలోని కొత్త ఇందిరమ్మ కాలనీ, జగనన్న కాలనీలో అనర్హులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని లోకాయుక్తకు ఫిర్యాదు వెళ్లడంతో శనివారం విశ్రాంత అడిషనల్ ఎస్‌పి, లోకాయుక్త విచారణ అధికారి గంగరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. 2019లో అప్పటి తహశీల్దార్లు బాలక్రిష్ణమూర్తి, చెంద్రాయుడు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు తెల్లరేషన్ కార్డుదారులకు, జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఇంటి పట్టాలను అనర్హులకు కేటాయించారని లోకాయుక్తకు ఫిర్యాదులు వెళ్లడంతో లోకాయుక్త, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఫిర్యాదుదారుడి సమక్షంలో సమగ్ర విచారణ చేపట్టారు. అనంతరం తయారు చేసిన నివేదికను లోకాయుక్తకు అందిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్లు మంజుల, ఫిరోజ్ ఖాన్, సర్వేయర్లు శ్రీనివాసులు, మురళి, విఆర్ఒలు మోహన్, సుధాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న లోకాయుక్త అధికారి, రెవెన్యూ అధికారులు



వాహనాలకు వేలం నిర్వహిస్తున్న ఎస్ఇబి అధికారులు

వాహనాల వేలంలో రూ.1.61 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-ములకలచెరువు

మండల కేంద్రమైన ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో శనివారం నిర్వహించిన వేలంపాటలు ప్రభుత్వానికి రూ.1,61070 ఆదాయం వచ్చినట్లు ఎస్ఇబి సిఐ మల్లికా తెలిపారు. అక్రమంగా మద్యం తరలించిన పట్టుబడిన 14 వాహనాలకు వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలును రాయచోటి ఇఎస్ పర్యవేక్షణలో నిర్వహించారు. వేలం పాటలో మూడు కార్లు 9 ద్విచక్ర వాహనాలు వేలం వేశామన్నారు. ఈ సందర్భంగా సిఐ మల్లికా మాట్లాడుతూ అక్రమ మద్యం, అనుమతి లేకుండా ఇసుక తరలించడం నేరమని తెలిపారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఇబి సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్య నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి-పీలేరు

వాహన కాలుష్యాన్ని నివారించి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి వాహనదారుడు సహకరించాల్సిన బాధ్యత ఉందని పీలేరు ఎంవిఐ అధికారిణి విజయ కుమారి తెలిపారు. వాహన కాలుష్య నివారణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 27, 28వ తేదీల్లో ట్రాఫిక్ కూడళ్లలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె తెలిపారు. శనివారం పీలేరు నాలుగు రోడ్ల కూడలిలో వాహనాలను ఆపి, వాహన చోధకులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ల వద్ద రెడ్ సిగ్నల్ పడినప్పుడు వాహనదారులు తమ వాహనాలను పూర్తిగా స్విచ్ ఆఫ్ చేసి, కాలుష్య నివారణకు పూర్తి సహకారం అందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో పీలేరు ఎఎస్ఐ మల్లికార్జున, పోలీసు, ఎంవిఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మొక్కుబడి!

ప్రజా'దృష్టి'

జడ్పీ, డిఆర్‌సి సమావేశాలు మొక్కుబడిని తలపించడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా ఎదుర్కొంటున్న సమస్యలను కూలంకషంగా చర్చించి సముచిత నిర్ణయాలు చేయాల్సి ఉంది. ఇటువంటి కీలక సమావేశాలను కేవలం ఐదు గంటల్లోపే మమ అనిపించడం విస్మయాన్ని కలిగిస్తోంది. దీనిపై తాజా జడ్పీ సమావేశంలో ఓ స్థానిక ప్రజాప్రతినిధి తమ ప్రాంత ప్రజల సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించాలని పట్టుబట్టడం అందరి దృష్టినీ ఆకర్షించింది. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి ఇలా స్పందించడమంటే జడ్పీ, డిఆర్‌సి సమావేశాల నిర్వహణ ఎంత అధ్వానంగా సాగుతుందో అర్థం చేసుకోవాలి. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎంఎల్‌సిలకు ప్రజల సమస్యలకు మించిన పనులేమిటో తెలియాల్సి ఉంది. ఒక వేళ అంతటి కాంట్రాక్టులు, వ్యాపారాలే కావాలనుకుంటే కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తలుగా మారితే బాగుంటుందనడం సబబుగా ఉంటుందేమో నాయకత్వాలు ఆలోచించుకోవాలి. ఇటువంటి వ్యాపకాలు ఎక్కువగా ఉంటే గైర్హాజరైతే సరిపోతుంది. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశంలో సమగ్రంగా చర్చించుకునే అవకాశం ఉంటుంది. జడ్పీ, డిఆర్‌సి సమావేశాలకు ఇన్‌ఛార్జి మంత్రి హాజరు కావాలనే పేరుతో సమావేశాల సమయాన్ని కుదిస్తున్నారా, లేక జిల్లా పరిషత్ పాలక వర్గానికి చిత్తశుద్ధి కొరవడిన ఫలితంగా కుదింపులకు పాల్పడుతున్నారా అనేది వెల్లడి కావాల్సి ఉంది. జిల్లా పరిషత్ పాలకవర్గం ఏర్పడిన అనంతరం రెండు, మూడు సమావేశాలు మినహా మిగిలిన సమావేశాలన్నింటినీ అరకొరగా నిర్వహించారు. ప్రధాన ప్రతిపక్షం కూడా పూర్తిస్థాయిలో జిల్లా పరిషత్, డిఆర్‌సి సమావేశాలను నిర్వహించాలని పట్టుబట్టిన దాఖలా లేవు. ప్రతిపక్ష టిడిపి నుంచి ఒక్కరే సభ్యులు ఉన్న నేపథ్యంలో వారి కేమీ పట్టని వ్యవహారంగా మారింది. జిల్లా వ్యవసాధారిత ప్రాంతం. ఇటువంటి ప్రాంతంలో వ్యవసాయానికి సంబంధించిన సమస్యలను లోతుగా చర్చించి నిర్ణయాలు, తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపించడం గురుతరమైన బాధ్యత. ఇటువంటి బాధ్యతను విస్మరించడం హేయనీయం. జిల్లాలో సాగు విస్తీర్ణం, ఎరువులు, విత్తనాలు, పురు గుమందుల లభ్యత, అకాల వర్షాల ధాటికి వాటిల్లిన నష్టానికి పరి హారం అందజేయడం వంటి అంశాలపై దృష్టి సారించాల్సి ఉంది. ప్రతిపక్ష టిడిపి ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అకాల వర్షం ధాటికి దెబ్బ తిన్న పంటలకు నష్ట పరిహారాన్ని ప్రస్తావించడం, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పరిష్కరిస్తామని హామీనివ్వడం వరకు పరిమితం కావడం కనిపించింది. జిల్లాలో ఏఏ ప్రాంతాల్లో ఏమేరకు నష్టం వాటిల్లింది. రెన్యూమరేషన్ ఎలా సాగుతోంది, ఎప్పటికి పరిహారం అందించే అవకాశం ఉంది. నష్టపోతున్న పండ్లతోటల రైతులకు భరోసా కలిగించే ప్రయత్నం చేయడం వంటి చర్యలకు ఉపక్రమించకపోవడం గమ నార్హం. జిల్లాకు వరప్రదాయినిగా చెప్పుకుంటున్న కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, జిల్లాలోని 15 ప్రాజెక్టుల పురోగతి ఎలా ఉంది. పనుల వేగవంతానికి తీసుకోవాల్సిన చర్చలేమిటి, అన్నమయ్య, పింఛా, దిగువ సగిలేరు ప్రాజెక్టు పనుల పురోగతి ఎలా ఉంది. రానున్న వర్షాకాలంలో ఇరిగేషన్ ఇంజినీర్లు ప్రాజెక్టుల సందర్శన చేయించడం వంటి ముందుచూపును నాయకత్వం కలిగి ఉండాల్సి ఉంది. ఇటువంటి వాతావరణంలో డిఆర్‌సి సమావేశాలను ప్రయివేటు సమావేశాలుగా మార్చారు. మీడియాకు అనుమతి ఉండటం లేదు. దేశ రక్షణ వంటి ప్రత్యేక సందర్భాల్లో మీడియాను అనుమతించకపోవ డాన్ని అర్థం చేసు కోవచ్చు. కరువు జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై సాగే చర్చకు మీడియాను అనుమతించక పోవడం విడ్డూరమనే చెప్పాలి. ఎన్నడూ లేని సరికొత్త సంప్రదాయాన్ని వైసిపి సర్కారు అవలంభించడం గమనార్హం.

- ప్రజాశక్తి - కడపప్రతినిధి



అమర్‌నాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

'ఆకేపాటి' సేవలు అభినందనీయం : 'మేడా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మేడా వెంకట మల్లిఖార్జునరెడ్డి ప్రశంశించారు. టిడి రోగులకు అందించిన సేవలకు గానూ ఆకేపాటికి కేంద్ర ఆరో గ్యశాఖ (మినిస్టరీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా) ప్రశంసాపత్రాన్ని శుక్రవారం జారీ చేసింది. అమర్‌నాథ్‌రెడ్డి ఇటీవల 200 మంది టిబి రోగులను దత్తత తీసుకొని వారికి పౌష్టికాహారం అందచేశారు. ప్రధానమంత్రి టిబి ముక్తిభారత్ అభియాన్ కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ అందించిన సహకరం విలువైనదని, టిబి నివారణకు దోహదపడినందుకు కేంద్ర ఆరోగ్య శాఖ ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా శనివారం రాజంపేట ఏరియా ఆసుపత్రిలో డిప్యూటీ డిఎంహెచ్ఒ ఎస్‌సి కృష్ణ ఆధ్వర్యంలో టిబి నివారణా విభాగం అభినందన సభ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన మేడా వెంకట మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ యల్లారెడ్డి అమర్‌నాథ్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ అమర్ నాథ్‌రెడ్డి ఎంతో సేవా గుణం కలవారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి, నోడల్ ఆఫీసర్, రైల్వే కోడూరు మెడికల్ ఆఫీసర్ యూనిట్, టిబి సూపర్వైజర్, రిటైర్డ్ సిహెచ్ఒ, ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ హస్తవరం ఉమామహేశ్వర్‌రెడ్డి, వడ్డే శీను, వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ నాయుడు, మహిళా కార్యదర్శి మిరియాల సురేఖ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ప్రజాశక్తి - బి.కొత్తకోట



స్తంభం ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్ అహ్మద్ చొరవతో పట్టణంలోని ఒకటవ సచివాలయం పరిధిలో శనివారం విద్యుత్ స్తంభాలు దీపాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలోని కరెంట్ కాలనీ ప్రజలు మాట్లాడుతూ గతంలో విద్యుత్ స్తంభాలు వీధుల్లో లేకుండా ఉన్నందున వీధి దీపాలు ఏర్పాటు చేసేందుకు విద్యుత్ స్తంభాలు చాలా దూరం ఉండడంతో వీధి దీపాలు ఏర్పాటు చేసేందుకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరడంతో ఈ సమస్యను స్థానిక వైసిపి నాయకుల దృష్టికి తీసుకెళ్లామని, వారు ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డికి సమస్యను తెలియజేశారన్నారు. ఆయన వెంటనే స్పందించి కొత్త విద్యుత్ దీపాలను సత్వరమే వేయించి తమ సమస్యను పరిష్కరించారన్నారు. సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు, పాగొండ ఖలీల్‌కు, ఎఒ గిరిధర్‌కు, ఒకటి సచివాలయం కన్వీనర్ గుమ్మడికాయల చాంద్‌బాషా తుమ్మ గింజల జనార్ధన్‌కు, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.



దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ ప్రచారం చేస్తున్న పోలీసులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలోని ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో దొంగతనాలు జరగడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు, బంధువుల ఇళ్లకు వెళ్లే వారు పోలీసులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. తద్వారా పోలీసులు ఆ ఇంటిపై ఇంటి యజమానులు వచ్చేవరకు నిఘా ఉంచడం జరుగుతుందన్నారు. పాఠశాలలకు సెలవులు కావడంతో చిన్నపిల్లలు ఈత కోసమై నీటి కుంటల వద్దకు వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారని, తల్లి దండ్రులు వారి పిల్లలను గమనిస్తూ ఉండాలని సూచించారు. వేసవికాలంలో అపరిచిత వ్యక్తుల సంచారం ఎక్కువగా ఉంటుందని, కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని స్థానిక బస్టాండ్ లో ఆటో ద్వారా ప్రచారం చేయించారు. రెండు రోజులుగా నిమ్మనపల్లి బస్టాండులో అర్ధరాత్రి సమయంలో కొత్త వ్యక్తులు సంచరిస్తున్నారని, రాత్రి వేళల్లో పోలీసులు మరింతగా నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్ఐగా రహీముల్లా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కలికిరి



నూతన ఎస్ఐగా ఎస్.కె. రహీముల్లా శనివారం బాధ్యతలు చేపట్టారు. కలికిరి స్ఐగా విధులు నిర్వహిస్తున్న లోకేష్‌రెడ్డిని బదిలీపై మదనపల్లి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా ఆస్థానంలో ఎస్‌పి ఉత్తర్వులు మేరకు జిల్లాలోని వీరబల్లి మండలంలో విధులు నిర్వహిస్తున్న రహీముల్లాను బదిలీపై కలికిరికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు కాపాడటానికి, స్టేషన్ కు వచ్చే బాదితులకు న్యాయం చేయడానికి తన వంతు కృషి చేస్తానని, దీనికి మండలంలోని ప్రజలు, అధికారులు, నాయకులు సహకరించాలని కోరారు.

శ్రీరేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టకు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని వి.వడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టకు శనివారం ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి ఆయన సతీమణి ముద్దా పెద్దవిజయమ్మ గ్రామస్తుల సమక్షంలో రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వై.మల్లికార్జున, వెంకటయ్య, వెంకటేష్, రాజా వినయ్ వైయస్ మధు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



రూ.లక్ష విరాళాన్ని అందజేస్తున్న ఎంపిపి దంపతులు

టమోటా రైతుల కష్టాలు తీరేనా?

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మార్కెట్‌కు చేరిన టామోటాలు

ఈ ఏడాదైనా ధరలు పెరిగి తమ బాధలు తీరేనా అనే ఆశల పల్లకిలో టమోటా రైతన్నలు ఉన్నారు.మదనపల్లి డివిజనులో ఎక్కువ మంది రైతులు టమోటా పంటను రైతులు సాగు చేస్తుంటారు. ఈ పంటను సాగు చేయాలంటే లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిందే. అయితే ఇటీవల కాలంలో టమోటా ధరలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా సీజన్లో ధరలు నిలకడగా ఉండేవి. అయితే దేశంలోని పలు ప్రాంతాల్లో టమోటా పంటను విరివిగా పండిస్తుండడంతో వ్యాపారస్తులకు అక్కడే టమోటాలు లభిస్తుండడం మదనపల్లి మార్కెట్‌పై ప్రభావం చూపుతోంది. మదనపల్లి మార్కెట్ ఆసియాలోనే అతి పెద్ద మార్కెట్ గా ప్రసిద్ధిగాంచింది. ఈ మార్కెట్‌కి ప్రతి రోజు 900 టన్నులకిపైగా టమోటోలు వస్తున్నాయి. ప్రస్తుతం 30 కిలోల ఏ గ్రేడ్ టమోటాల బాక్స్ ధర రూ.200 నుండి రూ.300 వరకు పలుకుతుండగా, బి గ్రేడ్ ధర రూ.100 నుండి 200 వరకు పలుకుతోంది. 15 రోజుల క్రితం పూర్తిగా పతనమైన ధరలు, కాస్త పుంజుకున్నాయి. ఈ ధరలతో గట్టెక్కే పరిస్థితిలో లేమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం 30 కిలోల బాక్స్ ధర రూ.500 పలికితే కొంత మేర ఉపశమనం లభిస్తుందన్నారు. ఎకరా టమోటా పంట సాగు చేయాలంటే కనీసం రెండు లక్షలు పెట్టుబడికి కావాల్సిందేనన్నారు.దీనికి తోడు దినసరి కూలీలు సైతం ఒక్కొక్కరికి రూ.500 చెల్లించాల్సి వస్తోంది. టమోటా ధరలు పెరిగితే తమ బాధలు తీరి గట్టెకుతామని రైతన్నలు చెబుతున్నారు.ఒకవేళ ధరలు ఇలాగే కొనసాగితే రాష్ట్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధితో తమను ఆదుకోవాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సైబర్ నేరస్తుల మాయలో పడకండి : సిఐ



సిసి పుటేజీలను పరిశీలిస్తున్న సిఐ మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

ప్రజలు సైబర్ నేరస్తుల మాయలోపడి ఆర్థికంగా నష్టపడకుండా తగిన జాగ్రత్తలో ఉండాలని పీలేరు సిఐ మోహన్‌రెడ్డి తెలిపారు. ఎస్పీ ఆర్.గాంగాధరరావు ఆదేశాల మేరకు శనివారం స్థానిక సిఐ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు చూపే అత్యాశలకు లోను కావద్దని హెచ్చరించారు. ఎటిఎంల దగ్గర కూడా కొందరు నేరస్తులు ఖాతాదారులను మభ్యపెట్టి మోసం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అలాంటి వారి నుంచి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వేసవికాలంలో దొంగతనాలు జరగకుండా ప్రజలు తమ ఇండ్ల దగ్గర తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. కుటుంబ సభ్యులు ఇల్లు వదిలి ఎక్కడికి వెళ్లాలన్నా పోలీసులకు సమాచారం అందిస్తే, రాత్రిళ్ళలో పోలీసులు బీట్ ఒకటికి రెండుసార్లు తిరిగే అవకాశం ఉంటుందని అన్నారు. వేసవిలో బడులకు సెలవులు కావడంతో పిల్లలు తమ స్నేహితులతో కలిసి సేద తీరడానికి ఈత పేరుతో చెరువులు, కుంటలు, బావుల దగ్గరకు వెళ్లకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. తాము కూడా ప్రమాదాలున్న చోట సూచిక బోర్డులు ఏర్పాటు చేశామని అన్నారు. వాహన ఛోదకులు రోడ్డు భద్రత నియమ నిబంధనలను అనుసరిస్తూ వాహనాలు నడపాలని, వాహనాలకు సంబంధించిన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి వాహనాలు నడపాలని అన్నారు. వాహనాలు నడిపే సమయంలో వేగాన్ని నియంత్రిస్తూ ప్రమాదాలకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు. పట్టణంలో సిసి కెమెరాలపై ప్రత్యేక దృష్టి సారించిన సిఐ బాబా సాహెబ్, పీలేరు అర్బన్ సిఐ మోహన్‌రెడ్డి ఎస్పీ ఆదేశాల మేరకు వారు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరు పరిశీలనలో భాగంగా పోలీస్ కార్యాలయంలోని సిసి కెమెరాల పుటేజ్‌లను తనిఖీ చేశారు. పట్టణంలో 40 చోట్లకు పైగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది అని, ముఖ్యమైన ప్రదేశాల్లో మరికొన్ని సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, పట్టణంలో దుకాణదారులు తమ దుకాణాల వద్ద ఉంటే సిసి కెమెరాలు రాత్రిళ్ళలో ఆన్ చేసి ఉంచాలని దుకాణాల యజమానులను కోరారు. మండల, పట్టణ పరిధిలో ఎవరైన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

బి.కొత్తకోట : సైబర్ నేరాలపై మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిటిఎం ఎస్ఐ డి.రవీంద్ర బాబు ప్రజలకు సూచించారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల గురించి ఇంటర్నెట్ ఆధారంగా జరిగే వక్తిగత, ఆర్థిక, భద్రత పరమైన తదితర నేరాలు పెరిగిపోయాయన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్టు దరించి వాహనాలు నడపాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతి వేగం ప్రమాదకరమని తెలియజేశారు. ఆటో డ్రైవర్లు జాగ్రత్తగా బండ్లు నడుపుతూ తమ ప్రాణాలను రక్షించుకోవడంతో, ప్రయాణకుల ప్రాణాలకు రక్షణ కల్పించాలన్నారు. రహదారి భద్రతా నియమాలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారించవచ్చునని సూచించారు.

ఘనంగా మాజీ ప్రధానమంత్రి నెహ్రూ వర్ధంతి

ప్రజాశక్తి-పుల్లంపేట



నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రైల్వేకోడూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి గోశాల దేవి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నల్ల కదిరిగాళ్ళ శాంతయ్య ఆధ్వర్యంలో శనివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో భారతదేశ మొట్టమొదటి ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోసాల దేవి, శాంతయ్య మాట్లాడుతూ మొదటి ప్రధాని అయినటువంటి జవహర్‌లాల్ నెహ్రూ సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ ఆ రోజులలో దేశం ఎంతగానో అభివృద్ధి చెందిందని నాటి తరం నుండి ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, మన్మోహన్ సింగ్, పివి.నరసింహారావు ప్రధానులుగా చేసి ఈ దేశానికి మేలు చేశారని పేర్కొన్నారు. నాటి బ్రిటిష్ పరిపాలన తరిమి కొట్టి నేడు యావత్తు భారత దేశ ప్రజలందరూ కూడా స్వచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నారంటే అది కాంగ్రెస్ పార్టీ ఘనతేనని తెలిపారు. నాడు కులమతాలు అతీతంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అనగారిన వర్గాలను న్యాయం చేకూర్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీనని తెలిపారు. నేడు కేంద్రంలో ఉన్నటువంటి భారతీయ జనతా పార్టీ విధివిధానాలకు నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విధివిధానాలను భారత దేశ ప్రజలు చీకొడుతున్నారు. 2024లో దేశ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కావాలని కోరుకుంటున్నారు. మత విద్వేషాలకు తావు లేకుండా రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు భారత్ జోడి యాత్ర చేసి ఒక్క తాటిపైన నడిపించే విధంగా పోరాటం చేస్తున్నారని తెలియజేశారు. 2024లో రాహుల్ గాంధీ సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పుల్లంపేట మండల అధ్యక్షుడు, యువజన నాయకుడు సిగమాల రమేష్. మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలకు రక్త పరీక్షలు నిర్వహించాలి

ప్రజాశక్తి- కలకడ

ప్రతి ఐదు సంవత్సరాలలోపు గల పిల్లలకు హిమోగ్లో పరీక్షలు నిర్వహించాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ఎంవి కిషోర్ కుమార్ రెడ్డి జవహర్ బాబులు సూచించారు మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలకు ఎంఎల్‌హెచ్‌పిలకు ఆశా కార్యకర్తలకు వైద్యాధికారులు డాక్టర్ ఎంవి కిషోర్ కుమార్ రెడ్డి, డాక్టర్ జవహర్ బాబు ఆధ్వర్యంలో హీమోగ్లోబిన్ టెస్ట్ ట్రైనింగ్ ఇవ్వడం జరిగినది. హమో గ్లోబిన్ టెస్ట్ గురించి వైద్యాధికారి మాట్లాడుతూ గరవేతులకు సకాలంలో వారి ఇంటి వద్దనే హిమాగ్లోబిన్ టెస్ట్ చేసేందువల్ల హీమోగ్లోబిన్ శాతం తెలుసుకోవచ్చునని ఆరోగ్య కార్యకర్త గ్రామాలు వెంట వెళ్ళినప్పుడు అందరి గరవేతులకు.బాలింతలకు టెస్టులు చేయవచ్చునని సున్నా నించి ఐదు సంవత్సరముల పిల్లలకు హిమగ్లోబిన్ టెస్ట్ తెలుసుకోవచ్చునని 50 సంవత్సరాల పైబడిన వారందరికీ కూడా హిమో గ్లోబిన్ ఎంత శాతం ఉందో తెలుసుకోవచ్చునని వారు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ గారి ఆధ్వర్యంలో ప్రతీ సచివాలయానికి హిమోగ్లోబిన్ మీటర్లు పంపిణీ జరిగినది. వీటిని ఆరోగ్య కార్యకర్తలకు ఇవ్వడం జరిగినది.ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ జి.జయరామయ్య సూపర్వైజర్ ముజీబ్ భాష రెడ్డమ్మ ల్యాబ్ టెక్నీషియన్ జమీల్ అహ్మద్ ఆరోగ్య కార్యకర్తలు ఎంఎల్‌హెచ్‌పి కార్యకర్తలు పాల్గొన్నారు.

శిశువుల అనారోగ్య సంకేతాలు గుర్తించాలి

పీలేరు: శిశువు అనారోగ్య సంకేతాలను తల్లి గుర్తించే పరిజ్ఞానం ఉన్నప్పుడే శిశు సంరక్షణ సాధ్యమని హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య తెలిపారు. శనివారం పీలేరు మండలం, తలుపుల పిహెచ్‌సి పరిధిలోని మద్దెల చెరువుపాలెంలో తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో "శిశు సంక్షేమం తల్లి బాధ్యత" అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రేమ, ఆప్యాయత, అనురాగం కోసం తల్లి బిడ్డ అరునెలల పాటు ఒక యూనిట్ గా ఉండడంవల్ల తల్లి స్పర్శ ద్వారా శిశువుకు భద్రతా భావం కలగడమే కాకుండా, బిడ్డ మేథోవృద్ధికి చక్కగా దోహదం చేస్తుందని చెప్పారు. శిశువు రోజుకు 8 నుంచి 10 సార్లు తల్లిపాలు తాగి, 5 నుంచి, 6 సార్లు మూత్ర విసర్జన చేస్తే అమ్మ ఇచ్చే కమ్మనిపాలు శిశువుకి సరిపోతున్నట్లు తల్లి భావించాలని సూచించారు. శిశువుకు సూక్ష్మక్రిముల నుండి రక్షణ, ప్రస్తుత ప్రతికూల వాతావరణంలో శిశువు రక్షణకై జాగ్రత్తలు పాటిస్తూ, ఆరునెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. శిశువు అసాధారణ రీతిలో ఎడ్వడం, జ్వరం, శరీరంలో ఎక్కడి నుంచైనా స్రావాలు రావడం, పాలు త్రాగాలనే ధ్యాస లేని శిశువుల్ని పాలు తాగే ప్రతి సారి వాంతి ఉన్నచో తక్షణం ప్రభుత్వ చిన్నపిల్లల వైద్య నిపు ణులతో ఉచిత సూచన, సలహాలు, చికిత్స, పొందాలని కొండయ్య తల్లులకు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎన్ఎం వసుంధర, సిహెచ్ఓ నాగము త్యం, ఆశ కార్యకర్తలు శిరీష, కమల అంగన్వాడీ కార్యకర్త పాల్గొన్నారు.



పిల్లల తల్లికి సూచనలు చేస్తున్న డాక్టర్ కొండయ్య

జెవికె-4లో ప్రతి ఉద్యోగీ భాగస్వామి కావాలి

కడప అర్బన్: జెవికె-4 ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి అందించేందుకు జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్షలో ప్రతి ఒక్కరూ భాగస్వాములని రాష్ట్ర పరిశీలకులు అల్లం సత్యనా రాయణ సూచించారు. శనివారం ఎంఇఒ పాలెం నారాయణ పరిధిలోని కడప మండల స్టాక్ పాయింట్ సిఎస్ఐ హై స్కూల్‌లో ఆయన యూనిఫామ్ క్వాలిటీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ప్రతి ఏడాది విద్యార్థికి జెవికె అందించే లక్ష్యంగా పని చేస్తుందని పేర్కొ న్నారు. సమగ్ర శిక్షణ పరిధిలో పని చేస్తున్న ఎంఐఎస్ కో- ఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, పార్ట్‌టైం ఇన్‌స్పెక్టర్లు, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ టీచర్లు భాగస్వాములుగా పని చేయాలని ఆదేశించారు. ఎంఇఒ అవసర నిమిత్తం తమ పరిధిలోని ఉద్యోగులకు జెవికె-4 సకాంలో విద్యార్థులకు అందించేందుకు క్వాలిటీ కంట్రోల్ టీం ద్వారా పర్యవేక్షించాలని సూచించారు.

పారదర్శకంగా బదిలీలు : ఎస్‌పి

రాయచోటి టౌన్: జిల్లాలో వివిధ పోలీసు స్టేషనులో ఐదు సంవత్సరాల నుండి పని చేస్తున్న ఏఎస్ఐస్, హెడ్ కానిస్టేబుల్స్, పోలీసు కానిస్టేబుల్స్‌కు శనివారం ఎస్పీ ఆర్.గంగాధరరావు జిల్లా పోలీసు కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్‌లో బదిలీల కార్యక్రమం నిర్వహించారు. ఆయన పోలీసు సిబ్బందితో స్వయంగా మాట్లాడి, వారి వ్యక్తిగత సమస్యలు, పిల్లల చదువులు, కుటుంబ సభ్యుల అనారోగ్య కారణాలు, స్పౌస్ కోటాకు ప్రాధాన్యత కల్పించి, వివిధ పోలీసు స్టేషనుల్లో ఏర్పడిన ఖాళీలను బదిలీలతో భర్తీ చేశారు. బదిలీల్లో ఎటువంటి సిఫార్సులకు తావులేకుండా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జిల్లా ఎస్పీ వ్యవహరించి, సిబ్బంది కోరుకున్న చోటుకు బదిలీ చెయ్యడంతో పోలీసు సిబ్బంది తమ ఆనందాన్ని, సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ వి.బి.రాజ్ కమల్, ఎస్‌బి సిఐ సత్యనారాయణ, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బదిలీల ప్రక్రియ నిర్వహిస్తున్న ఎస్‌పి గంగాధర్‌రావు



మహానాడులో పాల్గొన్న జిల్లా బిసి నాయకులు

మహానాడులో జిల్లా బిసి నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎన్టీఆర్ శత జయంతిని పురస్కరించుకొని రాజమహేంద్రవరంలో జరుగుతున్న మహానాడు వేడుకలు పండుగ వాతావరణంలో జరుగుతున్నాయని టిడిపి రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ పేర్కొన్నారు. 27, 28వ తేదీల్లో రెండు రోజులపాటు జరుగుతున్న ఈ వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుండి పసుపు సైనికులు లక్షలాదిగా తరలి వచ్చారన్నారు. ఈ వేడుకల్లో భాగంగా తొలి రోజైన శనివారం రాజంపేట పార్లమెంట్ పరిధిలోని బిసి విభాగం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అక్కడ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నారన్నారు. జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర టిడిపి అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడు, ఇతర సీనియర్ పార్టీ నాయకులు తమ ప్రసంగాలతో పార్టీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపారన్నారు. మహానాడు వేడుకలకు హాజరైన నాయకులకు కార్యకర్తలకు భోజన వసతి,విశ్రాంతి తీసుకోవడానికి బ్రహ్మాండమైన సౌకర్యాలు కల్పించారని కితాబునిచ్చారు. ఈ వేడుకలకు బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, పార్లమెంట్ మహిళా విభాగం నాయకులు విజయమ్మ, శ్రీరాములు, దెయ్యాల శ్రీనివాసులు హాజరయ్యారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీలు : ఎపిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలో 17వ విడత సామాజిక తనిఖీలు జరుగుతున్నట్లు ఉపాది హామీ ఎపిఒ రమేష్ తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 2022-23 ఆర్థిక సంవత్సరం గాను ఉపాధిహామీ పథకంలో 1848 పనులు చేశామన్నారు. ఇందుకు గాను రూ.4,22,70,000లు ఉపాధి హామీ నిధులను ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. జగనన్న గృహ నిర్మాణ శాఖ విభాగంలో 1715 పనులు, 98 పనులు ఉపాధి హామీ విభాగంలో, మెటీరియల్ కాంపోనెంట్ కింద 35 పనులకు నిధులను ఖర్చు చేసినట్లు వివరించారు. క్షేత్రస్థాయి తనిఖీల అనంతరం జూన్ 3వ తేదీన సామాజిక తనిఖీ బహిరంగ సభను నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో స్టేట్ రిసోర్స్పర్సన్ భాస్కర్, డిస్టిక్ రిసోర్స్ పర్సన్ పవన్ కుమార్, నూతన్ పవన్, జ్ఞానేంద్ర క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు.

చదువుల్లో సత్తాచాటుతున్న మమత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బి.కొత్తకోట మండలంలోని బండారువారిపల్లి గ్రామ పంచాయతీ, పెద్దపల్లిలో నివాసముంటూ, వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఎ.శ్రీనివాసులు, ఎ.సుమతీలకు ఇద్దరు సంతానం. వీరు ఇద్దరు పిల్లలను ఎంతో కష్టపడి చదివించుకుంటున్నారు. ఇద్దరు పిల్లలు చాలా బాగా చదివి మంచి ఉత్తీర్ణతతో ముందుకు వెళ్తున్నారు. వీరి కుమార్తె ఎ.మమత 10వ తరగతిలో 90 శాతం, ఇంటర్మీడియటులో 95 శాతం మార్కులతో ఉత్తీర్ణతను సాధించింది. ప్రస్తుతం ఈ అమ్మాయి నంద్యాలలోని అద్యం ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది.ఈ అమ్మాయి తెలివితేటలను గుర్తించి వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి తన స్వగ్రామమైన పెద్దపల్లిలో నివాసం ఉంటున్న ఎ.మమతకు ఉచిత ల్యాప్‌టాప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుల్లో అద్భుత ప్రతిభ కనబరుస్తున్న మమత భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సదరు విద్యార్థినికి తనవంతు సహాయ, సహకారాలు అందజేస్తానని స్పష్టం చేశారు.



మమతకు ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఉదయ్‌మోహన్‌రెడ్డి

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనాలు ఢీ : ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- కలకడ

ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులకు గాయాలైన సంఘటన మండలంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని నడిమిచర్ల పంచాయతీ నడమిచర్ల బంగారు వాండ్లపల్లెకు మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. బంగారువాండ్లపల్లికి చెందిన నూర్ సాహెబ్ కుమారుడు ఖాదరవల్లి తన ద్విచక్ర వాహనంలో వెళుతుండగా, గుర్రంకొండ మండలం ఏలుట్లకు చెందిన మణికుమార్, మోహన్ అనే ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఖాదరవల్లికి కుడికాలు విరగగా, మణి కుమార్, మోహన్‌లకు అరికాళ్ళకు రక్త గాయాలైనట్లు 108 సిబ్బంది తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే విషయం తెలుసుకున్న 108 సిబ్బంది ప్రమాదంలో గాయపడిన ముగ్గురు వ్యక్తులను శ్రీనివాసులు, వెంకట చలపతి తెలిపారు.

ప్రేమ విఫలమై.. యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-వాల్మీకిపురం



విద్యుత్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకున్న హరీష్ కుమార్ (ఇన్‌సెట్‌లో) ఫైల్‌ఫొటో

ప్రేమించిన అమ్మాయి దక్కలేదని.. ఆ అమ్మాయి స్వగ్రామంలోనే ఓ యువకుడు విద్యుత్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని యర్రావాండ్లపల్లిలో శనివారం చోటు చేసుకొంది. వివరాలు.. గుర్రంకొండ మండలం వంకాయల వారిపల్లికి చెందిన రైతు క్రిష్ణప్ప కుమారుడు హరీష్ కమార్ (22) డిగ్రీ పూర్తి చేసి పట్టణంలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేసున్నాడు. ఈ క్రమంలో వాల్మీకిపురం మండలం గండబోయనపల్లి పంచాయతీ యర్రావాండ్లపల్లికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమించాడు. ప్రేమ విఫలం కావడంతో మనస్థాపం చెందిన హరీష్ కుమార్ శుక్రవారం సాయంత్రం ప్రేయసి స్వగ్రామమైన యర్రావాండ్లపల్లిలో ఎవ్వరూ లేని సమయం చూసి విద్యుత్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం గమనించిన గ్రామస్థులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సిఐ క్రిష్ణయ్య ఆధ్వర్యంలో సంఘటనాస్థలానికి చేరుకొని విచారించి, పంచనామ నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ నాగేశ్వర రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.